

జయంపు కృష్ణ

ప్రేమ నిజానికి ఒక విచిత్రమైన 'కెమికల్'. దాని 'యాక్షన్స్', 'రియాక్షన్స్' ఇవీ అని ఖచ్చితంగా ఏ సైంటిస్ట్ కనుగొనలేకపోతున్నాడు. ప్రపంచంలో ఇంతవరకు సంపూర్ణంగా మేధావులు సైతం తెలుసుకోలేని విషయాలలో 'ప్రేమ' ఒకటి.


జ్యోత్స్న ఆలోచిస్తూ కూర్చుని ఉంది లాన్‌లో. పచ్చిక పచ్చగా ఉంది. ఆ పచ్చిక మధ్యన 'పసిడిబాల' లా ఉంది జ్యోత్స్న. అందమైన ఆమె కనుబొమలు అనిశ్చితంగా కదలాడుతున్నాయి. ఆ కనుబొమల మధ్య తీర్చి దిద్దిన ఎర్రనిబొట్టు సంధ్యాభాస్కరునితో 'సవాల్' చేస్తున్నది. . .

ఎంత వద్దనుకున్నా భానుమూర్తిని ప్రేమించకుండా ఉండలేకపోతున్నది.

పాపం! భానుమూర్తి!

కొత్తగా పెళ్ళైన భానుమూర్తి లక్ష్మితో ఎంతో అన్యోన్యంగా ఉండేవాడు. ఒక్క క్షణం విడిచి ఉండాలన్నా విలవిల లాడిపోయేవాడు. లక్ష్మి కూడా అంతే! అప్పుడే క్షీరసాగరంలో ప్రభవించిన మహాలక్ష్మికి మల్లే ఎంత అందంగా ఉంటుందని! సోగకళ్ళతో ఎప్పుడూ అతని





ఛాయల్నే గమనిస్తూ ఉండేది. స్టాఫ్ మెంటాలిటీ ఉమన్! ప్రతి స్త్రీలోనూ మృదుత్వం, సున్నితత్వమే అబలత్వానికి, మమకారానికి కారణమేమో?

వాళ్ళకు పెళ్ళై సంవత్సరంకూడ తిరక్కుండానే లక్ష్మి గర్భవతి కావడమూ, ఆ కాన్పులోనే ఆమె, ఆ బిడ్డ చనిపోవడమూ . . పాపం, . . భానుమూర్తి . . . ఎప్పుడూ 'షేవ్' చేసుకొని, నీటుగా తళతళలాడే ఆ వ్యక్తి క్షణాల మీద పిచ్చివాడై పోయాడు. ఆడదానిలో అంత శక్తి ఉందా? స్త్రీ లేకుండా పురుషుడు బ్రతకలేడా? ఏమిటో— అర్థంకాని ఆలోచనలు?

తనకు పెళ్ళయింది. భర్త ఉన్నాడు. మరి, భర్త ఉండికూడా ఇలా ఈ భాను మూర్తిని ప్రేమించడ మేమిటి? అలా ప్రేమించవచ్చా? భానుమూర్తి అలా ఎవరి కోసమో వెదుకుతూ, పిచ్చివాడిలా తిరుగుతూ ఉంటే. . . అలాగే అతనిని తన కౌగిలిలోకి తీసుకుని పసివానిలా ఓదార్చాలనిపిస్తుంది. భానుమూర్తిని ప్రేమిస్తున్నది అతనిపై జాలితోనా? సానుభూతితోనా? లేక అతను, లక్ష్మి ఉన్న అన్యోన్యత చూసాక అనుభూతి తనలో అంతర్గతమై ఇలా ఇప్పుడు ప్రేమగా పెల్లుబికిందా? ఏమిటీ మనసు తత్త్వం! తన భర్త దగ్గర అసంతృప్తి ఏం ఉందని?

ఏమో, జ్యోత్స్న ఆలోచనలతో ఉండగానే అందమైన కన్నెపిల్ల వారజేసి కళ్ళకు తీర్చి దిద్దుకుంటున్న నల్లని కాటుకలా చీకట్లు ముసురుకున్నాయి.

ఆమె ఒక్క దీర్ఘ నిట్టూర్పు వదిలి, ఇంట్లోకి నడిచింది.

స్త్రీ పురుషులు . . . ఎవరివి, ఎవరు... ఎప్పుడు, ఎందుకు ప్రేమించు కుంటారో అనూహ్యం!

• • •

డాక్టర్ వర్మ ఇండియాలోనే కాక, ఇతర దేశాలలోకూడ సుప్రసిద్ధుడైన సైంటిస్ట్. జనిటిక్స్‌లో ఎన్నో పరిశోధనలు చేశాడు. 'రిబోన్యూక్లిక్ యాసిడ్', 'డీ ఆక్సీ రిబో న్యూక్లిక్‌యాసిడ్' మీద అతనుచేసిన పరిశోధనలు వైద్యశాస్త్రంలో విప్లవం తెచ్చాయి. ప్రస్తుతం డాక్టర్ వర్మ ఢిల్లీలో ప్రభుత్వ అధీనంలో మరికొన్ని పరిశోధనలు చేస్తున్నాడు.

డాక్టర్ వర్మ కోరి చేసుకున్న భార్య జ్యోత్స్న. జ్యోత్స్నకూడా సైన్స్‌గ్రాడ్యుయేట్. పెద్ద పెద్ద కళ్ళతో బంగారు బొమ్మలా ఉంటుంది. అప్పుడప్పుడూ ఆమె అందాన్ని పరిశీలనగా చూస్తూ మురిసి పోతూ ఉంటాడు డాక్టర్ వర్మ, "నువ్వు నిజంగా ఒక రచయిత అర్ధాంగివై ఉంటే ఎంత బాగుండేది?" అని.

భారత ప్రభుత్వం డాక్టర్ వర్మకు అన్ని వసతులూ సమకూర్చింది ఏ లోటూ లేదు. డబ్బు, కారు, సిగిలు, మేడ లన్నీ ఉన్నాయి వారికి. మొదట మొదట తను ఎంతో అదృష్టవంతురాల నని మురిసిపోయేది జ్యోత్స్న. ఆంధ్ర నుండి ఢిల్లీ వెళ్ళాక, కొన్నాళ్ళు భర్తతో ఎంతో హాపీగా గడిపేసింది విందులు, వినోదాలు, పెద్ద పెద్ద వాళ్ళతో పరిచయాలు, అనేక ప్రోగ్రాములు . . ఓహో. . ఒకటేమిటి. . . లక్నిసి. దేశంలో ఏ మూల ఏ కాన్ఫరెన్స్ జరిగినా భర్తతోబాటు వెళ్ళేది జ్యోత్స్న. తరవాత తరవాత అలా కాన్ఫరెన్స్‌లకు వెళ్ళడం మానేసింది డాక్టర్ వర్మ మాత్రం 'నీ కెలా ఇష్టం అయితే అలా చెయ్యి' అనేవాడు, కానీ, 'నీ సన్నిధి నాకు స్వర్గంలా ఉంటుంది' అని నవ్వుతూ మనసులోని మాట వెలిబుచ్చేవాడు.

ఇలాటి పరిస్థితులలో—

పక్కింటి భానుమూర్తి వాళ్ళతో పరిచయంఅయింది, భానుమూర్తి వివాహ సందర్భంలో వాళ్ళు ఆంధ్రులు కావటాన— వారి కుటుంబంతో సన్నిహితత్వం ఎక్కువయింది. డాక్టర్ వర్మ ఏదైనా కాన్ఫరెన్స్‌కు వెళ్ళినప్పుడు, లాబొరేటరీలో ఉన్నప్పుడు ఒంటరిగా తోచక అలా వారింటికి వెళ్ళి గడిపేది జ్యోత్స్న. ఆ నూతన దంపతుల అనురాగం చూసి జెలసీ ఫీల య్యేది.

క్రమంగా ఆలోచసాగింది జ్యోత్స్న. "నేను నిజంగా మంచి జీవితం గడుపు తున్నానా? డాక్టర్ వర్మ వలన నిజమైన ఆనందాన్ని పొంద గలుగుతున్నానా? ఏమో . . . వారనేది నిజమేనేమో? . . నేను ఒక మహా రచయితకు అర్ధాంగి నయి ఉంటే? ఓహో. . . నా కళ్ళ మీద . . . నా చెక్కిళ్ళ మీద ఎన్ని కథలు? ఎన్ని కవితలు? ఆ. . . అన్నట్టు భాను మూర్తి కథలు రాస్తాడట! మంచి భావుకుడట! !. . . లక్ష్మి నిజంగా అదృష్టవంతురాలు. . . నిజంగా అదృష్ట వంతురాలు. . . ఇలా సాగేవి ఆమె ఆలోచనలు. భానుమూర్తి— ఢిల్లీలోనే ఓ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. సన్నగా, పొడుగ్గా, ఎర్రగా ఉంటాడు. తెలుగు లోనూ, ఇంగ్లీషులోనూ కథలు, గేయాలు రాస్తుంటాడు. చిన్నతనంలోనే మేధావిగా పరిగణించబడ్డాడు. మంచి వాక్చాతురి.

డాక్టర్ వర్మతో పరిచయం అయ్యాక, ఒకరి ఇంటికి ఒకరు రావడం జరిగేది. ఎలాగయితేనేం, లక్ష్మి చనిపోయిన భాను మూర్తి హృదయంలో పెంచుకుంది ప్రేమించిందా, పెద్ద కాలంలోనే జ్యోత్స్న ప్రణయంలో పడకుండా ఉండలేకపోయాడు. జ్యోత్స్న ప్రయత్నం ఎలా ఫలించిందో తన వయస్సుని, సొగసుని నిర్భయంగా, నిశ్చింతగా ఆ పురుషుడికి అప్పగించి, సంతృప్తి పొందింది ఆమె. అందుకు డాక్టర్ వర్మ విదేశ కాన్ఫరెన్సులు మరికొంత దోహదం చేశాయి.

జ్యోత్స్న, భానుమూర్తి ప్రణయం యథేచ్ఛగా సాగిపోసాగింది

ఒకనాడు జ్యోత్స్న గృహంలో ప్రణయ మందిరంలో అడిగాడు భానుమూర్తి:

"జ్యోత్స్నా! అంధకారంలో పడి పోయిందని అనుకున్న నా జీవితానికి కాంతి నిచ్చావు. నన్ను, నా జీవితాన్ని మరలా వెలుగులోకి తెచ్చావు. మంచో, చెడో. . ఇక నిన్ను వదిలి బ్రతుకుతానన్నది మాత్రం అసత్యం. కానీ, ఈ విషయం డాక్టర్ వర్మగారికి తెలిస్తే?"

"అవును. ఈ విషయం డాక్టర్ వర్మగారికి తెలిస్తే?" జ్యోత్స్న ఒంపైన కనుబొమలు విచిత్రంగా ముడి పడ్డాయి.

ఆలోచించసాగింది. 'అవును. ఆయ నకు తెలిస్తే చంపేయరూ? ఆయన నా కేం తక్కువ చేశారని? నేనే గృహిణి ధర్మాలను దాటానేమో? నేను చేస్తున్నది పాపమేమో? నో. . .నో. . . నెవర్. . . నా కంటే వయస్సులో పది సంవత్సరాలు పెద్ద ఆయన. ఇంత చిన్నదాన్ని. . . నన్నెలా వివాహమాడారు? పెళ్ళి చేసుకుని నన్ను తెచ్చి ఈ నగరంలో పెట్టి, కాన్ఫరెన్స్‌లంటూ, పరిశోధనలంటూ దేశదేశాలు తిరుగుతూ ఉంటే. . . నేను మనిషిని కాదా? నాకు కోరికలు లేవా? . . . ఓహో. . . మరి, ఆయన దేశానికి చేస్తున్న సేవలో అలా నేను భాగం పంచుకోవడం లేదా? జీవితం అంటే అలాటివి అన్నీనా? లేక. . . లేక. . . ఉత్త శరీర వాంఛలా? ఏమో? ఏమో? . . . ఆయన నన్ను బాగానే చూసు కుంటారు. నా అందం ముందు వెన్నలా కరిగిపోతారు. తనతోబాటు నేను ఎక్కడికి వెళ్ళాలన్నా అభ్యంతరం చెప్పరు, ఒక్క లాబొరేటరీకి తప్ప. ఒకవేళ ఒక్కొక్కప్పుడు తను తెగించి అక్కడికి వెళ్ళినా విసుక్కోరు; కోపగించరు. నవ్వుతూ నచ్చచెప్పి, పంపుతారు. ఆయన మాత్రం మనిషి కాదా? వారికి మాత్రం కోరికలు లేవా? మరి. . . మరి. . . భానుమూర్తి అంటే తన కెందు కింత. . .'

"ఏమి టంత దీర్ఘంగా ఆలోచిస్తు న్నావు, జ్యోత్స్నా?" ఉలికిపడి తను

సన్నిధిలో ఉన్న భానుమూర్తిని చూచింది, విస్ఫారిత నేత్రయై "ఒక్క ప్రశ్న అడగనా?" అంది.

"నిరభ్యంతరంగా!" నవ్వాడు భానుమూర్తి.

"ఒకవేళ, మనిద్దరం నా పెళ్ళి కాక పూర్వమే ప్రేమించుకున్నామనుకో! కథల్లో లాగ, సినిమాల్లోలాగ కొన్ని అన్ అవాయిడబుల్ సర్‌కమ్‌స్టన్‌సెస్ వలన నాకు డాక్టర్ వర్మతో వివాహం నిశ్చయమయింది. అప్పుడు నిన్ను నా వివాహానికి ఆహ్వానిస్తే. . . నువ్విచ్చే సమాధానం ఏమిటి? ఆ నా పెళ్ళికి నువ్వు వస్తావా?"

భానుమూర్తి జ్యోత్స్న అందాల మోమును తన దోసిట్లోకి తీసుకుని ఆమె విశాల నేత్రాలలోకి చూస్తూ మధురంగా పలికాడు: "వస్తాను. నా హృదయంలోని రక్తాన్ని కుంకుంగా మార్చి నా పెదవిలోని లేతను పసుపుగా చేర్చి, అందు నా కన్నీటిని పన్నీరుగా మార్చి నీ పదపల్లవములకు అర్పించను తప్పకుండా వస్తాను. నా జీవిత కుసుమాన్ని నీ ముందు ఉంచి, ముకుళిత హస్తుడనై 'నా బ్రతుకేం కావా'లని నిన్ను మనసారా అర్థించను తప్పకుండా వస్తాను. మన ప్రేమ కోసం, నీ కోసం ఏమైనా చేస్తాను. ఏమయినా అయిపోతాను. నిజం జ్యోత్స్నా! నిజంగా నిజం!"

'ఈ రచయిత తను బ్రతికించింది. ఈ భావుకుణ్ణి తను వదులుకోగలదా? తను లేకుంటే ఈ మనిషి జీవించగలడా?'

ద్వంద్వభావనలో ఆమె గుండె ఓ క్షణం ఆగింది.

జ్యోత్స్న కళ్ళలో నీళ్ళు ఉబికాయి.

"జ్యోత్స్నా!" ఆమె కళ్ళు చెమర్చడం చూచి, చలించాడు భానుమూర్తి.

అతని శిరస్సును అలాగే తన గుండెలకు హత్తుకొని, "భానూ! నాకు చచ్చిపోవాలని ఉంది! !" అంటూ రోదించ సాగింది జ్యోత్స్న.

* * *

డాక్టర్ వర్మ జెనిటిక్స్‌లో కొత్త కోడ్ కనిపెట్టాడు. దానికి 'జ్యోత్స్న జెనిటికల్ కోడ్' అని నామకరణం చేశాడు. ఆ కోడ్ వలన జెనిటిక్స్‌లో అనూహ్యమయిన మార్పులు వచ్చాయి. 'జీన్‌యాక్షన్'లోనూ, 'డియాక్సీ రిబోన్యూక్లిక్ యాసిడ్ ట్రాన్స్‌క్రిప్షన్'లోనూ, 'అమినోయాసిడ్స్' అమరికలోనూ, 'జీన్ హెలికల్ స్ట్రక్చర్ డెరివేషన్' లోనూ... అనుకోని మార్పులు, చేర్పులు సంభవించాయి. ప్రతిభావంతమైన అతని పరిశోధనను భారతప్రభుత్వం ఎంతగానో ప్రశంసించింది. 'జ్యోత్స్న జెనిటికల్ కోడ్' వివరణను, డిఫెరెంట్ ఫీల్డ్స్‌లో దాని అప్లికేషన్స్‌ను గురించి చర్చించను మాస్కోలో జరగనున్న అంతర్జాతీయ సైంటిస్టుల మహాసభకు డాక్టర్ వర్మను సగర్వంగా, సగౌరవంగా పంపేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది భారతప్రభుత్వం.

ప్రపంచ వ్యాప్తం కాబోతున్న తన 'జ్యోత్స్న జెనిటికల్ కోడ్'ను గూర్చి భార్యతో చెప్పాలని, ఆమె ఆనందంతో పరవశించి పోతూ ఉంటే తను పై పరవాలనీ ఉద్వేగంగా ఇల్లు చేరిన డాక్టర్ వర్మ తన బెడ్‌రూమ్‌లో జ్యోత్స్న, భానుమూర్తి ప్రణయ సన్నివేశాన్ని చూచి నిశ్చేష్టుడై. . . భరించలేక అలాగే హాలులోపలికి వెళ్ళి, సోఫాలో కూలిపోయాడు.

కొన్ని నిమిషాలు నిశ్శబ్దం రాజ్యం చేసిం దక్కడ!

తరవాత జ్యోత్స్న తిరగబడి, ధైర్యంగా నిజాన్ని చెప్పేసింది. భానుమూర్తికి దూరంగా తను ఇక బ్రతకలేదని, భానుమూర్తితోనే ఉండిపోవాలని నిశ్చయించుకున్నానని నిక్కచ్చిగా చెప్పేసింది. డాక్టర్ వర్మ ముఖం చూడలేక అక్కణ్ణుండి తన ఇంటికి వెళ్ళిపోయాడు భానుమూర్తి, ఆ భర్త ముందు ఆ భార్యను వదిలేసి.

డాక్టర్ వర్మ ఉద్రేకపడలేదు. జ్యోత్స్న ఊహించుకున్నట్లు చంపెయ్యనూ లేదు. కనీసం పల్లెత్తు మాట అయినా అనలేదు. అతని గొంతు చాలా గంభీరంగా ఉంది:

"జ్యోత్స్నా! నిన్ను ఏరి, కోరి నేను కొన్నాను నేను. నీ ఊపిరిలో నాలోని సైంటిస్టు జీవం పోసుకున్న మాట వాస్తవం. ఇన్నాళ్ళకు నా కృషి ఫలించింది. అంతర్జాతీయంగా నాకు గుర్తింపు లభించే, నా దేశం గర్వించే పరిశోధన సిద్ధించింది. కానీ, జ్యోత్స్నా ఆనా పరిశోధనకు ఏం పేరు పెట్టానో తెలుసా? 'జ్యోత్స్న జెనిటికల్ కోడ్' ... హుం. . . కవిగానీ, కళాకారుడుగానీ, సైంటిస్ట్ కానీ... అందరూ మనుషులే, జ్యోత్స్నా! అందరిలోనూ కొట్టుకునేది గుండే! ! ! నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో నేను, నీకు తెలియదు. ఎంతగానో చెప్పనా... నీ సుఖం కోసం, నీ సంతోషం కోసం. . . నువ్వు కోరిన ప్రకారంగా నిన్ను వదులుకునేటంత గొప్పగా ప్రేమిస్తున్నాను నిన్ను! . . . అల్‌రైట్. . . నేను రచయితను కాదు. . . ఏవేవో అందంగా చెప్పేందుకు నాకు భాష రాదు. కానీ, జ్యోత్స్నా భావం ఉంది, గుండె ఉంది చెప్పానుగా? ?. . . నిన్ను నాతో మాస్కో తీసుకెళ్ళాలని. . . నాకు అందబోయే ఆనందం నీకూ పంచాలనీ . . . ఏ వేవో కలలు కంటూ వచ్చాను ఇంటికి... ప్చ్... ప్చ్... ఏమీ హూ... స్వేచ్ఛను చంపే దుర్మార్గుణ్ణి కాదు. కానీ, నా కళ్ళెదుట నిన్ను దూరంగా చూడలేను. నో. నా వల్ల కాదు. ఇవిగో కీస్. సేఫ్‌లో కావలసినంత డబ్బుంది. ఇంట్లో కావలసినన్ని వస్తువులున్నాయి. నీ కేం కావాలో ఎంత కావాలో తీసుకో. నాకేం అభ్యంతరం లేదు. కానీ. . . కానీ, జ్యోత్స్నా? మరొక్కసారి బాగా ఆలోచించ నిదే నీ నిర్ణయానికి జీవం పోయకు. ఆ తరవాత నీ ఇష్టప్రకారం చెయ్యి. ఓ కె! . . నేను మాస్కో వెళుతున్నాను. బహుశా నాలుగు రోజులు అక్కడే ఉండచ్చు. నేను తిరిగి వచ్చేలోపల నీ అభీష్టాన్ని యథేచ్ఛగా సాగించుకో. మరో మాట. . . నువ్వు నా తోనే ఉండాలని నిర్ణయించుకున్నా నా కేం అభ్యంతరం లేదు. నా అర్ధాంగిగా నిన్ను స్వీకరించేందుకు సిద్ధమే నేను" అంటూ విరాగిలా పైకి లేచాడు డాక్టర్ వర్మ. "వెళుతున్నాను, జ్యోత్స్నా!" అంటూ గుమ్మం వరకు వెళ్ళి, ఒక్క మారు తిరిగి అచేతనంగా నిలుచుని ఉన్న జ్యోత్స్న వంక చూచి, "జ్యోత్స్నా! నా పరిశోధనకు ఏ పరిస్థితులలోనూ పేరు మాత్రం మార్చను. దాని పేరు జ్యోత్స్న జెనిటికల్ కోడ్"! పిచ్చివాడిలా అనుకుంటూ వెలుపలికి వెళ్ళిపోయాడు డాక్టర్ వర్మ.

అతని కళ్ళు చెమర్చడం లీలగా కనుపించింది జ్యోత్స్నకు!. . .



* * *

డాక్టర్ వర్మ అనేక అభినందనలతో రష్యా నుండి తిరిగి వచ్చాడు. ఇంటర్ నేషనల్‌గా అన్ని పేపర్స్ ఆ సైంటిస్ట్‌ను గూర్చి, అతని 'జ్యోత్స్న జెనిటికల్ కోడ్'ను గూర్చి గొప్పగా రాశాయి. అతనికి ఎన్నో సత్కారాలు లభించాయి. ఇండియాకు తిరిగి రాగానే అతనిగౌరవార్థం ప్రభుత్వం ఏర్పాటుచేసిన విందులో పాల్గొని, పూలమాలలతో హుటాహుటిని బంగళా చేరుకున్నాడు. ఎక్కడా విసుగు కానీ, విషాదం కానీ కనపరచ లేదు డాక్టర్

వర్మ. కానీ, స్వగృహంలో ... పెట్టగానే అతన్ని అనేక ఆలోచనలు ముంచి వేశాయి. గుండె దడదడ లాడింది.

లోపలకు రాగానే జ్యోత్స్న నవ్వుతూ స్వాగతం పలికింది. అభ్యంగన స్నానమాచరించి, ధవళవస్త్రధారిణియై ... అబ్బ! స్త్రీలో ఎంతటి శక్తి నిబిడీకృతమై ఉంది. . .?

డాక్టర్ వర్మ హృదయం ఉప్పొంగింది. అలాగే దగ్గరికి వెళ్ళి, తన మెడలోని గులాబి మాలలు జ్యోత్స్న మెడలో మనసారా వేశాడు. ఆమె అందమైన నడుం చుట్టూ చేతులు వేసి, దగ్గరకు లాక్కోబోయాడు.

సున్నితంగా వారించి, "స్నానం చేద్దురు గాని, రండి!" అంది జ్యోత్స్న, మెడలోని మాలలతో అలాగే లోపలికి నడుస్తూ. . .

డాక్టర్ వర్మలో వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. మానసికంగా ఇంత ఆనందం మాస్కోలోకూడా అనుభవించ లేదు.

స్నానం చేసి, తన రూమ్‌లో కెళ్ళి బట్టలు మార్చుకున్నాడు. నిలువెత్తు అద్దం చూసుకుంటూ, తల దువ్వుకుంటూ జ్యోత్స్నకు ఎన్నో కబుర్లు చెప్పాలని, ఆమె ఒడిలో తన అలసటను తీర్చుకోవాలని అనుకొంటున్నాడు. తిరిగి హాల్లోకి వస్తుండగా, తన టేబిల్‌మీద 'ఎర్ర లేబిల్ కవరు' కనిపించింది. 'వెరీ అర్జెంట్ మెసేజ్' మాత్రమే అలా అక్కడ ఉంటుంది. వెంటనే వెళ్ళి, ఆ కవరు అందుకుని, చించి చదివాడు. అందులో ఇలా ఉంది:

"మిమ్మల్ని ఏమని సంబోధించాలో అర్థం కావడం లేదు. భగవదంశ మీలో ఉంది. అందుకే మిమ్మల్ని నా 'దేవుని'గా నమస్కరిస్తున్నాను.

హిందూ స్త్రీలో ప్రవహించే మహర్షుల రక్తం నాలో పెల్లుబికింది మీరు వెళ్ళాక. మిమ్మల్ని నేను సరిగా అర్థం చేసుకోలేకపోయాను. మీరిచ్చిన స్వేచ్ఛను, అధికార్ని అనవసరంగా మరోలా ఉపయోగించుకున్నాను. వివాహబంధానికి నిజమైన అర్థం చాలా ఆలస్యంగా తెలుసుకోగలిగాను. మీ భార్యగా నేను మీ నుండి పొందిన ప్రేమా, పేర్లూ అమూల్యాలు. అటువంటి మీ ప్రేమ పూజకు ఇంక నేను అనర్హురాలిని. మీ నిర్విరామ కృషికి, మీకు తోడుగా మీతో నిలిచిన 'జ్యోత్స్న ఒనిటకల్ కోడ్'లోని జ్యోత్స్న ఎప్పటికీ మీ గుండెల్లోనే ఉంటుంది. నేను మాత్రం శిక్ష అనుభవించాలి. అందుకే మీకు దూరంగా వెళ్ళి పోతున్నాను. ప్రపంచ ప్రఖ్యాత సైంటిస్టు భార్యగా కాదు; హృదయమున్న సంస్కారి ప్రేమపూజకు నోచుకోని అభాగ్యురాలిగా!

నమస్కృతులతో,

కలుషిత...

—(మీ) జ్యోత్స్న."

డాక్టర్ వర్మ హృదయం ఆవేదనతో స్పందించింది.

'ఏమి టిది? జ్యోత్స్న ఎందు కిలా రాసింది? బహుశా... అనేళ రాసి పెట్టిందేమో? ? ?. . . ఏమో. . .?'

తల ఎత్తాడు. . .

ఎదురుగా గోడలకు తగిలించి ఉన్న అనేకమంది సైంటిస్టులు, మేధావులు ఏదో సందేశాన్ని క్రుమ్మరింవారు గుండెల్లో. . .

'నో. . .నో. . .'. . .

ఉత్తరాన్ని మడిచి, జేబులో ఉంచుకున్నాడు. పెళ్ళినాటి ఫొటోలో తన పక్కన జ్యోత్స్న అలవోకగా నవ్వుతూ ఉంది. . .

'ఏదీ జ్యోత్స్న? కనిపించినట్లు కనిపించి, అదృశ్యమయింది? ?'. . .

కిచెన్‌రూమ్ కేసి నడిచాడు.

"రాజా! అమ్మగా రెక్కడ?"

"మేడమీద ఉన్నారు, సార్!"

గుండె కొంచెం కుదుట పడింది.

మెట్లెక్కాడు డాక్టర్ వర్మ. మేడ మీది బెడ్‌రూమ్ లోకి వెళ్ళాడు. తను ముచ్చటగా మెడలో వేసిన గులాబి మాలలతో అలాగే బెడ్‌మీద ప్రశాంతంగా పడుకొని ఉంది జ్యోత్స్న! ! !

వెళ్ళి, మధురంగా పిలిచాడు. పక్కన కూర్చొని, మృదువుగా కదిలించాడు.

అచేతనంగా ఉంది జ్యోత్స్న. కానీ, ఆమె అరవిచ్చిన చేతిలో ఇంకా ఉన్న 'పాయిజన్' సీసా మాత్రం 'టప్'మని కింద పడి ముక్కలయింది. ★


# 23% వడ్డీ గడించండి

ఐఓబివారి విశిష్టమైన

## ద్వంద్వ పొదుపు పథకం

కోరిన దానిని ఎన్నుకోండి!

| డిపాజిట్ కాలం (మాసములలో) | | వడ్డీ% సాలుకు (సుమారుగా) |
|---|---|---|
| 181 | ... | 23 |
| 157 | ... | 20.5 |
| 121 | ... | 17 |

| డిపాజిట్ కాలం (మాసములలో) | | వడ్డీ% సాలుకు (సుమారుగా) |
|---|---|---|
| 85 | ... | 14.5 |
| 62 | ... | 13 |
| 37 | ... | 10.3 |

మీకు సమీపంలోగల ఐఓబి బ్రాంచితో సంప్రదించండి

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు

FDS IOB 2078 TEL A